# వైపని

జూన్ మొదటి వారం పొద్దుటిపూట స్నానం చేసినట్టు పెయ్యంతా చెమట. కొంచెం సేపటికే ఎక్కడి నుంచో ఒక తెప్ప 'సరసర' వచ్చి 'దబదబ' నాలుగు చినుకులు రాల్చి వచ్చిన దారిలో ఎటో నడిచిపోతోంది. ఇంకా వానా కాలం పూనీపూననట్టుగా ఉంది. 'చర్‌చరా' మెరుపులు ఉరుములు పెద్ద బండలు ఎవరో దొర్లించినట్టు. కొర్రాయి లెక్క ఎండ. మొగులంతా పొద్దులు నిండిన ఆడమనిషి తీర్గ 'గుడగుడ'లాడుతుంది. తడిసీ తడవని మొదటి వాన మట్టి సువానసతో వేపపూల పరిమళంతో గాలి అంతా 'కమ్మకమ్మ'గా అదో మాదిరిగా వస్తుంది.

ఉదయం తొమ్మిదిన్నర అయింది. తహసీల్ ఆఫీస్ ముందు అంతా ఆగమాగంగా ఉంది. నున్నగా ఊడ్చి సుట్టుపక్కల నీళ్ళు చల్లినట్టున్నారు. రోడ్డు నుంచి ఆఫీస్ దగ్గరి దాకా తొవ్వకు రెండువైపుల గీత గీసినట్టు తెల్లని పొడి సున్నం పోశారు. దారికి సైనికులు కాపలా ఉన్నట్టు అక్కడక్కడ వృక్షాలైన అయిదు వేపచెట్లు వచ్చిపోయేటోల్ల నెత్తి మీద చిన్నగా చెయ్యి మర్లేసి 'టోంగులు' పొడిచినట్టు అప్పుడప్పుడే పండీ పండనట్టున్న దోరకాయల్ని చిటుక్కున రాలుస్తున్నాయి. తల మీద పడ్డోల్లు దులుపుకొని కళ్ళు పైకెత్తి ఎవరన్నట్టు చూస్తున్నారు. కింద పడ్డప్పుడు వినీ వినపడని చిత్రమైన చప్పుడు వస్తుంది. 'బుర్‌బుర్'మంటూ జీపులు వచ్చేటియి వస్తున్నాయి. అప్పుడే వచ్చి అటు ఇటూ చుట్టుపక్కల తిరిగి అక్కడ డ్యూటీలో ఉన్న వాళ్ళతో చర్చించి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులతోని నిలుచున్న దగ్గరి నుంచి ఫోన్‌లో గెచ్చుకు గెచ్చు' మాలేసుగ పొడుగున్న పోలీసు పెద్ద సార్ మాట్లాడుతున్నాడు.

టెంట్ హౌస్ పిల్లలు టెంట్లను వేసి కొన తాళ్ళను కట్టడానికి 'సీకులు' దిగ్గొడుతున్నారు.



Scanned by CamScanner

లేచిన టెంట్ల కింద కుర్చీలు లైన్‌గా వేస్తున్నారు. తహసీల్ కచ్చేరికి కొంచెం ముందర కొత్తగా కట్టిన ఎన్.జీ.ఓ.ల క్లబ్ అందులో కిరాయకు ఉన్న 'సమగ్ర మాతాశిశు సంక్షేమ కేంద్రం'. ఇంకో నాలుగడుగులు పైకి పోతే ఆర్.డి.ఓ. ఆఫీస్. తహసీల్ భవనానికి చెరో పక్క మంటలార్పే ఫైర్ స్టేషన్, పైసలు ఇచ్చి పుచ్చుకునే ట్రెజరీ కార్యాలయము. తహసీల్‌కు ఎన్.జి.ఓ. బంగ్లాకు నడుమనున్న ఖాళీ ప్రదేశంలో పదిన్నరకు జరుగబోయే మీటింగ్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుంకరుల మీద పట్వారీలు, పట్వారీల మీద గిరిదావర్‌లు, గిరిదావర్‌ల మీద ఎం.ఆర్.ఓ., ఎం.ఆర్.ఓ మీద ఆర్.డి.ఓ. చెయ్యి తడపని ఫైలు మీద 'గుర్ గుర్' లాడినట్టు ఒకరి మీద ఒకరు సవారి చేస్తున్నారు. ఎగిరెగిరి పడ్తున్నారు. అప్పుడే కోపానికి వస్తున్నారు. మంది మెల్లమెల్లగా వచ్చి కుర్చీలలో కూర్చుంటున్నారు. స్వయంగా ఏర్పాట్లు చూస్తున్న ఆర్.డి.ఓ. దగ్గరికి చోటా మోటా నాయకులు వచ్చి 'పదిన్నరకు మీటింగ్ అంటిరి. ఇంతకు మంత్రులు కరీంనగర్ నుంచి బయలెల్లింద్రటనా లేదా సార్' అని అడుగుతున్నారు. ఆఁ.. ఆఁ.. కరీంనగర్ నుంచి ఎల్లి ఇరవై నిమిషాలయింది. ఇక అద్దగంటలో వస్తరు. 'రాంగానే మీటింగ్'. సమాధానం చెబుతున్నాడు.

విషయం ఎట్లా తెలిసిందో ఏమోగాని అప్పటిదాకా పల్చపల్చగా ఉన్న జనం గుంపులు గుంపులుగా వచ్చి కూర్చుంటున్నారు. నిలబడి ముచ్చట్లు పెట్టెటోల్లు పెడుతూనె ఉన్నారు. చూస్తుండగానే చుట్టుపక్కల చాలా భాగం ఖద్దర్, పసుపు పచ్చ, ఈ మధ్యన వచ్చిన కాషాయ బట్టలతో నిండిపోయింది.

నిలుచున్న దగ్గర్నుంచే ఆర్.ఎం.ఆర్.ఓ., ఆర్.డి.ఓ.లు తమ ముందు ఉంచాల్సిన ఫైళ్ళ గురించి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. 'సరే సరే', అవునవును'లతో నిర్మల్ చెక్కబొమ్మలెక్క ఉద్యోగుల తలలు ఊగుతున్నాయి. తొందరపడుతున్నారు, తొందర పెడుతున్నారు. ఎప్పుడూ లేనంత ఓపిక చిర్నవ్వును ముఖం మీదికి తెచ్చుకొని కలుపుగోలుగా అధికార్లు మాట్లాడుతున్నారు.

దాదాపు రెండు వేల కుర్చీలు వేశారు. మామూలుగా కేంద్ర, రాష్ట్రాలకు చెందిన నలుగురైదుగురు మంత్రులు, వారి వారి తాబేదార్లు మందీ మార్బలము కలెక్టర్ ఇతర శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనే సమావేశమాయే మరి. అంతా ఆర్భాటంగా ఉంది.



Scanned by CamScanner

వేదిక ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. పైగా అఫీషియల్ మీటింగ్. వేదిక మీద ఉండాల్సిన కుర్చీలను లెక్క పెట్టుకోని చూసుకు సరిగ్గా అధికారి సర్దుతున్నాడు. కుర్చీల మధ్య వచ్చిపోవడానికి అనుకూలంగా తొవ్వ విడిచిపెట్టారు. 'విలేఖరులు', 'వి.ఐ.పి.'లు అని అట్ట ముక్కల మీద రాసి పాతిన కంకబద్దలు ఎడమ వైపు ముందటి వరుసలో ఉన్నాయి. కుడి వైపున 'చేనేత ఆత్మహత్యల బాధిత కుటుంబాలు' అని ఉన్న బ్యానర్ సైడ్ వాల్ కర్టెన్‌కు వేళ్ళాడుతుంది. బ్యానర్ ముందు కుర్చీలలో చేతికి ఎదిగివచ్చిన కొడుకుల్ని కోల్పోయిన తల్లితండ్రులు, భర్తల్ని పోగొట్టుకొన్న భార్యలు, తల్లితండ్రుల్ని పోగొట్టుకున్న పిల్లలూ, వాళ్ళ వాళ్ళ చుట్ట పక్కాలు- అంతా కలిపి యాభై అరవై మంది దాకా పిల్లి పట్టిన కోళ్ళలాగా 'అగులు దిగులుగా బుగులు బుగులుగా' అటిటూ చూస్తూ సగం సగం కూర్చున్నారు.

పోలీసులు కీసుపిట్టల్ని కీసుకీసుమంటూ ఒక్కసారి ఊదుతున్నారు. 'పెద్దగా' సైరన్ చేసుకుంటూ నిలుచున్నవారికి టక్కర్ ఇస్తదేమోనన్నట్టుగా జీపు ముందరవచ్చి ఆగింది. రెండు నిమిషాలు ఆలస్యంగా వరుసగా కార్లు, జీపులు ఎవరో వెంట తరుముతున్నట్టు వచ్చి నిలుచున్నాయి. చేతులు జోడించిన నమస్కారాలు, ఒక్క చెయ్యి నమస్తేలు, కళ్ళతోనే నమస్తేలు, చేతుల చేయి కలుపుకోవడాలు- అన్నీ నిమిషాల్లోనే జరిగిపొయ్యాయి. డాగ్ బంగ్లా దగ్గర ఎదిరి చూసేటోల్లు పడిపాయెనన్నట్టు ఉరికి వస్తున్నారు.

కలెక్టర్ స్థానిక అధికారికి ఏదో పురమాయించాడు. ఆయన వేదిక మీదికి పోయి మంత్రులనూ, పరిధిలోని ఎమ్మెల్యేలనూ, కలెక్టరునూ, స్థానిక మునిసిపల్ చైర్‌పర్సన్‌ను ఆహ్వానించాడు. వచ్చి ముందు వరుసలో కూర్చొని కూర్చోక ముందే మీటింగ్ ఇప్పటికే అరగంట ఆలస్యమైందని లేచి, సభా నిర్వహణ కొరకు పైన ఎవరికి సూచించిన కుర్చీల్లో వారు ఆసీనులయ్యాతు. జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించాడు.

వెంట వచ్చిన అధికారులు పక్కనున్న వేప చెట్టు కింద నిలుచున్న ఇక్కడి అధికార్లతో 'సాబ్ ఖైరత్ హై జనాబ్' అంటూ మాట ముచ్చట పెడుతున్నారు.

స్థానిక అధికార్లు "ఏం బాగ సాబ్, రెండు నెల్ల నుంచి ఇంట్ల కడుపు నిండ తిన్నది లేదు. కంటి నిండ నిద్రపోయింది లేదు. తెల్లారితె ఏమైతదో ఏమో, ఎటువంటి వార్త



Scanned by CamScanner

వినవలసి వస్తదోనని పరేషాన్. ఎవరో ఒకరు ఉరి వేసుకునో, పురుగు మందో 'నైట్రోఫ్' తాగో, గ్యాసునూనె పోసుకు కాలపెట్టుకునో చావడం. ఉరుకుడే ఉరుకుడు-విచారణలు, నివేదికలు, నష్ట పరిహారాలు, టెలిఫోన్ కాన్ఫరెన్సులు, ఫోన్లు, అర్జంటు మెసేజ్‌లు, పత్రికలు, వార్తలు, చివాట్లు. వాళ్ళు చచ్చుడేమో గాని అమ్మో! టెన్షన్ టెన్షన్. ఇట్లయితె ఎక్కువ రోజులు నౌకరి చేయలేము" తనతో పాటు ఉద్యోగంలో చేరిన, ప్రస్తుతం పెద్దపల్లిలో పని చేస్తున్న మరో అధికారితో ఆత్మహత్యల కన్నా తనదే పెద్ద బాధ అయినట్లు ఓ అధికారి 'సిల్ సిలా' చెప్పుకొస్తున్నాడు. మీటింగ్ మొదలైంది. ముందే పరిస్థితులు మంచిగ లేవని పోలీసులు కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకున్నారు. సభకు వచ్చినోల్లు పారిపోకుండ కావలున్నట్టు టెంటు చుట్టూ పోలీసులు నిలుచున్నారు.

"చేనేత కార్మికులకు, పరిశ్రమకు ప్రభుత్వం ఎంతో చేసిందని, ఇంకా చేస్తుందని, ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు పంచిన పదివేల రూపాయల గురించి, హైటెక్ అభివృద్ధి గురించి, జన్మభూమి గురించి, జలయజ్ఞం గురించి, శ్రమదానం గురించి, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి చేనేత పరిశ్రమకు ఇప్పటివరకు చేసిన, ఇక ముందు చేపట్టబోనున్న చేయూతల గురించి" టూకీగా నల్లటి టీషర్టు వేసుకున్న కలెక్టర్ అప్పుడప్పుడే నునుపు తేరుతున్న బొర్రను కదిలీకదలనట్లు చిన్నగా కదలగా, తరువాత మునిసిపల్ చైర్మన్‌ను మాట్లాడమని ఆహ్వానించాడు.

తమ తమ రాజకీయ పార్టీల భేదాభిప్రాయాలు మరచి రెండో వరుసలోనున్న రాజకీయ నాయకులు ఏదో గునాయించుకు గుసగుసలాడుకుంటున్నారు. ఆపిన కుర్చీలల్ల ఇతరులు కూర్చునేసరికి విలేఖరులకు ఇంకా ముందు కుర్చీలు వేశారు. వాళ్ళు ఇప్పటికే ఆలస్యమైందన్నట్టు కుర్చీలు వేసీవేయక ముందే పోయి కూర్చొని జేబుల నుండి చిన్న నోటు బుక్కులను తీసి, పరీక్ష తరీకగా ఎవరిది వాళ్ళు రాసుకుపోతున్నారు. ఈ టి.వి., తేజ, స్థానిక సిటి, ఇన్‌కేబుల్ వాళ్ళు వీడియో తీస్తున్నారు. వేదికను, బాధిత కుటుంబాలను, వచ్చిన వారిని క్లిక్ మని మెరుపులు మెరిపిస్తూ ఒకటి రెండు సార్లు కెమెరాలు ఫోటోలు తీస్తున్నాయి. ఈనాడు విలేఖరి తన కలర్ ఫోటో తీశారా అని ఆరా తీస్తున్నాడు. మిగతా పత్రికల వాళ్ళు తమ తమ ఫోటోల గురించి చేతులతోనే కెమెరామెన్‌లకు సైగలు చేసి



Scanned by CamScanner

అడుగుతున్నారు.

ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలలోని వారు ఎవరిది వాళ్ళు ఎట్లా అన్నట్టు చప్పుడు చేయక, ఏమీ మాట్లాడక కామూష్‌గా బీరిపోయి వింటున్నారు. ఆ మందిలో మూడు రోజుల కింద కుటుంబం మొత్తం చీప్ లిక్కర్‌లో పురుగు మందు పోసుకు తాగిన నలుగురు చావగా, చిన్నమ్మాయి నాలుక మీద పడగానే 'ఎటెటో వాసన' చేదు ఉందని ఇంట్లో నుంచి బయటకు పరుగెత్తి బతికిన ఒకే ఒక్క ఏడెనిమిదేండ్ల వయసున్న శాంత ఉంది. ఆ పిల్లకు ఉన్న ఏకైక దిక్కు అమ్మమ్మ సక్కుబాయి పక్కన కూర్చొని ఉంది. ఆమె వయసు యాభై అయిదేండ్ల దాకా ఉంటుంది. ఆట కోయిల పిల్ల శాంత ఎటో చూస్తుంది. ఆ పిల్ల మొకంల చావు భయం ఇంకా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. సక్కుబాయి మనసంతా 'పచ్చిపుండు పుండోలే' సలుపుతుంది. గీ వయసుకే గిన్ని కట్టాలా? ఎంత దుర్జెట్ట రాత నాది. అన్ని జ్ఞాపకం వచ్చి కండ్లలో నీల్లు తిరుగాడుతున్నాయి. మనుమరాలు బెంగటీలి గుండె పగులుతుందని, ఎంత దుఃఖం వచ్చినా లోపలనే అణుచుకుంటుంది. ఇరువై అయిదేండ్లు ఎదిగిన ఒక కొడుకు రెండు నెలల కింద పగటి పూట మీద గ్యాసు నూనె పోసుకు కాలిపోగా, మొన్న మిగిలి ఉన్న బిడ్డ అత్తగారి కుటుంబం తెల్లారేసరికి తుడిచిపెట్టుకు పోయింది. ఏడ పుట్టి ఏడ పెరిగి ఎవల ఇంట్ల పడి మొగుడు బీవండికి పోగా కొడుకు, బిడ్డను చూసుక గుండె ధైర్నంతోని ఇంత దాక 'ఏదుక వస్తే ఇప్పటికి మనుమరాలు, తానూ మిగిలింది. ఆలోచనలు పరి పరి విధాల పోతున్నాయి. ఉండి ఎవర్ని ఉద్ధరియ్యాలనుకొని ఒక్కొక్కసారి తానూ చావాలనుకుంటుంది. మల్లి తనకు తానే కమస్కం చిన్న మనుమరాలు కోసమన్నా బతుకాలనుకుంటుంది సక్కుబాయి.

చైర్మన్ ఇటీవల కొత్తగా రాజకీయాలల్లకు వచ్చాడు. తనది పద్మశాలి కులం. నేతగాళ్ళ కష్టాలు తనకు తెలుసు. "పరిశ్రమ గిరాకీ లేక మూలపడుతుందని అగో గా వరుసలనే చస్తున్నారు. చచ్చిన కుటుంబాలకు ఇంకా సహాయం చెయ్యాలి. పరిశ్రమకు ఆర్థిక సహాయం అందించి ఆత్మహత్యల పరంపరను ఆపాలనీ మంత్రులకు విజ్ఞప్తి" రాజకీయాలకు వచ్చీరాగానే చైర్మన్‌గా ఆరు నెలల కింద గెలిచాడు. ఊహించకుండానే విజయం పొందాడు. అందుకే 'ఉనుక మీద రోకలి' లెక్క ఎగిరెగిరి పడుతున్నాడు. పైగా



Scanned by CamScanner

కేంద్ర మంత్రికి దగ్గరి మనిషి. మంత్రే స్వయంగా టికెట్ ఇప్పించిండనే ప్రచారం కూడా ఉంది.

మనుమరాలు లేచి తన వయసు పిల్లలు దూరంగా ఆడుకుంటున్న వైపు వస్తూ కనబడేసరికి సక్కుబాయి పిలిచి తన కాళ్ళ మీద కూర్చొబెట్టుకొని రెండు చేతులు శాంత చుట్టూ వేసి పొదివి పట్టుకుంది. సక్కుబాయి శరీరం ఇక్కడ ఉంది, మనసు ఎటెటో పోతుంది.

రజస్వల అయ్యి కాకముందే తులసీరాంతోని తన పెండ్లి జరిగింది. తల్లిగారు మద్దూరు అత్తగారు కూరెల్ల అప్పటికే తులసిరాం బొంబాయి మిల్లుల పని చేస్తున్నాడు. ఆరుగురు అక్కచెల్లెండ్ల మధ్య ఒక్కగానొక్క అన్న. అప్పటికి నలుగురి పెళ్లిల్లు అయ్యాయి. బొంబాయి నుంచి ఆరు నెల్లకో, యాడాదికో ఒకసారి ఇంటికి వచ్చి పోయేవాడు. తన లగ్గం అయ్యాక కొత్తల బొంబాయి పోనన్నాడు. తన తండ్రి మిల్లుల పని చేస్తున్నావనే పిల్లను ఇచ్చిన్నని అల్లునితోని లొల్లి పెట్టుకున్నాడు. అత్తమామలు వారీ ఇంట్ల మన కులకశ్పి దందా సరిగ్గా నడుత్తలేదు బిడ్డా! కొయ్యడల మనకు సుట్టుపక్కల ఆసాములున్న నూలు ఇచ్చే సేటే బతుకవోయిందు. గీయింత ఇద్దరాడపిల్లల్ని, ఒక అయ్య చేతుల పెట్టే దాక ఇంకో రెండు మూడేండ్లన్న పొయ్యిరా నాయినా తులసీరామూ అని బుదుర కిచ్చి చెప్పారు. ఆరికీసు పోనంటే పోనని తులుసీరాం మంకు పట్టు పట్టాడు.

ఏమనుకుందో ఏమో గాని అత్త రాట్నం సుడుతూ ఎవలు ఇంట్ల లేని యాల్ల చూసి దగ్గరికి పిలిచి, 'సక్కుబాయి, మమ్మల్నిడిసిపెట్టి వాడుండడూ, వాణ్ణిడిసి మేమువుండమూ, తప్పలేక బల్మీటికి దిక్కులేక బిడ్డా! కోడలువైనా నాఆరుగురు బిడ్డలల్ల బిడ్డసుంటి దానివి. గాచారం మంచిగ లేక తులసిని పొమ్మంటున్నంగని, వేరే విధంగా కాదు. జెర అవ్వా నీవన్న సెప్పి సూడరాదు." తనతో అంది.

తనేమన్నా 'ఆరపార' తీరిందాన్నా ఏమన్నానా. కొత్త కొత్త సంసారం పొద్దంతా ఎట్లంటే ఎట్లని ఆలోచన చేసి ఎట్లన్నా చెప్పాలనుకుంది. రాత్రి తులసీరాం రాగానే భయపడుకుంటూనే విషయం మెల్లగా సెవులేసింది. తెల్లారి తులసీరాం పొయ్యి దగ్గర మంట నెగేస్తున్న తల్లికి 'ఈ తాప పోతగని' అని చెప్పి కాళ్ళకు చెప్పులేసుకొని, కోపాన్నంతా సప్పుడు చేసుకుంటూ బయటకు నడిచాడు. జారట్ల స్నానం చేసి చీర చుట్టుకొని లోపలికి అప్పుడే వస్తున్న



Scanned by CamScanner

తనను 'అవ్వా సక్కా బుద్ధిగల నా తల్లీ' అంటూ కొనకొంగుతోని కండ్ల నీల్లు తుడుసుకుంటూ అత్తయనుసాల్ల దేవుని అర్రలకు నడిచింది.

కొత్త భార్యను ఇడిసి దూరం ఉండలేక బొంబాయి బస్సు ఎక్కాడు. అందరం కచ్రం కట్టుకొని ఏకాలమనకుంట నీళ్ళు ఉండే రాగి దోనెల శనిగరం ఆంజనేయస్వామి గుడి దగ్గర, వంటలకు పోయినం. బొంబాయి పోయిన పెనిమిటికి ఏమైందో ఏమో గాని నెల పొదుపు తిరుగకుండానే మళ్ళీ వచ్చాడు. తల్లిగారింట్ల ఉన్న తనను తోలుకపోను అత్తమామలు వచ్చారు. ఆ రోజు రాత్రి మనసు లోపల ఏముందో ఏమో గాని తన గుండెలల్ల తలకాయ పెట్టుకొని ఎక్కెక్కి ఏడ్చాడు. ఎట్ల ఊకుంచాలో తెలియక తనకు ఏడుపు తన్నుకు రాగా అల్లుకుపోయింది. అద్దు అద్దంటే ఎర్రగ బుర్రగ ఉందని ముడితే మాసిపోయే పిల్లను చూసి చేస్తిమి. పిల్ల బమలో వీడేమో మునిగి పోయిండు. రాత్రి లోపలి అరుగు మీద పండుకున్న మామ అత్తతోని అంటున్న మాటలు తమ ఇద్దరికి వినపడ్డాయి. నోరు మూసుకో. కన్నోనివి నువ్వే గిట్లంటే అవతలోల్లకు ఇంకింత ఎచ్చిరిక. వానికి మూతి మీసాలన్నా పురంగా ముదిరినయా. జెర ఆలోచన్తోని మాట్లాడాలే. నీ మీద మన్నుపడ. నోట్లెకు గిసుంటి మాట ఎట్లచ్చె. గిసుంటోనివనే రాంగానే రెండు వేల రూపాయలు మొకం మీద పారేసె కదా! నోటికి ఏది దోత్తె గదే. ఎంత వత్తె గంతె. బొంబాయిల 'కోలి' చూసుకున్నాడట. కోడల్ను తోలుకపోతానికి వచ్చిండు తెలుసా? అత్త, మామ మీది కోపానికి వస్తూ అంది.

అదిగో గట్ల పులుకు పులుకున తనూ, తులసీరాం కలిసి బొంబాయి తొవ్వ పట్టాం. ఇంట్ల వట్టిగనే వండి పెట్టుకుంట కూసోమంటే తానే పొద్దుపోక అయినా చేతులు ముందట పెట్టుకుంటే, కడుపులకత్తదా కాళ్ళకత్తదా! నాలుగు పైసలు కూడితే ఎందుకైనా మంచిదని నాట్లు, కలుపు, కండెలు చుట్టిన చేతుల తోనే బీడీలు నేర్చుకుంది. బిడ్డా, కొడుకు పుట్టారు. కొంచెం కొంచెం మరాఠీ, హిందీ మాట్లాడుడు, అర్థం చేసుకునుడూ వచ్చింది. బీవండి కాలిపోయింది. బిడ్డ ఈడు అయిదేండ్లు. కొడుకు మూడేండ్లు. ఏదో గప్పటి మరాఠోల్ల 'గడ్‌బడ్'ల తులసీరాంను కత్తులతో పొడువగా చచ్చాడు. తీరా ఇరువై ఏండ్లు రాక ముందే మొగుడు పోయిండని జమ అయిన మిల్లుల పైసలు తీసుకొని ఇద్దరు పిల్లలు తాను గొడ గొడ ఏడుసుకుంట కూరెల్ల వచ్చాము.



Scanned by CamScanner

దూరం నుంచి జెండాలు పట్టుకొని ఓ గుంపు 'చేనేత కార్మికుల్ని ఆదుకోవాలి' ముఖ్యమంత్రి డౌన్ డౌన్' అంటూ బిగ్గరగా నినాదాలు చేసుకుంటూ వస్తున్నారు. పోలీసులు అటు దిక్కు ఉరికారు. మంది ఆర్.డి.ఓ. ఆఫీసు దాకా వచ్చారు. ఇటు పోలీసులు, అటు జనం- ఉద్రిక్త పరిస్థితులు. మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మహా హుషారు. మైకుల నుంచే 'వాల్లను ఏమనకుండ్రి. ఇటు ఇడ్సిపెట్టుండ్రి' అని చెప్తుతున్నాడు. పోలీసులు లోలోపల ఉడికిపోతున్నారు. ఇటు వీల్లు, అటు రాజకీయ నాయకులు ఇద్దరూ మంచిగుంటరు. నడిమిల మేము బదునాం.

వచ్చిన మందిల నుంచి ఓ నాయకుడు విజ్ఞాపనపత్రం మంత్రికి అందజేశాడు. మంత్రి తన ఉపన్యాసాన్ని తిరిగి కొనసాగిస్తూ, "అప్పులు మాఫీ కావాలని అన్నారు. నేను తప్పకుండా ప్రభుత్వంతో మాట్లాడుతాను. న్యాయం జరిగేలా చూస్తాను. అప్పటిదాకా నా వంతుగా ప్రతి బాధిత కుటుంబానికి పది వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇస్తాను. అంతేగాక, పని లేక తిండి సరిగా దొరకని పేద కార్మిక కుటుంబాలకు ఆకలి కేంద్రం పెడుతున్నా. చెప్పాడు. అంతే, సభాస్థలమంతా చప్పట్లతో దద్దరిల్లింది. ఆ చప్పుడుకు సక్కుబాయి ఒక్కసారి ఉలిక్కిపడి మనుమరాల్ని మరింత దగ్గరికి జరుపుకొని బిగ్గరగా పట్టుకొంది. 'ధనులదేంది. హుండీలు రాత్తరు, రాత్తరు, ఇరువై ముప్పై లక్షలకు దివాల దీత్తరు. మిత్తికి ఇచ్చినోడు అప్పు తీసుకున్నోడు మంచిగనే ఉంటరు. ఆనికి మిత్తి సొల్లాశ. వీనికి ఉన్నన్ని రోజులు కాయిపాయి. నడిమిల పనోనికి ఉరి అచ్చింది. అప్పులు మాఫీ చెయ్యాలి అనుడే గని గా రాయిన చెరువు బద్దంఎల్లారెడ్డి, సుందరయ్య, ఇందిరా, పద్మ, రాజీవ్‌నగర్‌లల్ల ఉన్న ప్యాద కుటుంబాల సంగతేందని ఇమరస చేసేటొల్లు ఎవలు లేరు. గొర్రె బలిస్తే గొల్లోనికి లాభం. మందిల కూర్చున్న కార్మికులు తలో మాట ఎవరికి తోసింది వారు మాట్లాడుకుంటున్నారు. అరె సోయిలేదు మన శాలోల్లకు సాంచాలు పాత ఇనుప సామాన్ల అడ్డకాడ 'బెంగాల్‌ఖాత'కు కిలోల చొప్పున అమ్ముడు పోతున్నాయి. ఒక్క సేటన్నా, పత్రికలోల్లు, రాజకీయ నాయకులు వచ్చి మీ కాలు నొప్పేంది, మీ కడుపు నొప్పి ఏందని ఇచారం చేసిండ్రా. అచ్చిన పాపాన పోయిండ్రా. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకోవడం ఒక్క ఇంట్ల నాలుగైదు బోగస్ సొసైటీలు, ఎవని కడుపు కిందికి వాడు తోడుకునుడు. ఒక కుటుంబానికి కుటుంబం సత్తె మనం కారణాలు వేరే ఉన్నాయని మాట్లాడుకుంటం. సరే, వేరే ఉండచ్చు గని మనిషి



Scanned by CamScanner

చావాల్ననే కోరిక ఎనుకనున్న 'వేపుకతినుడు' సంగతి ఏంది. ఇంకోలకు ఏం సెపుతం. మన కులంల మనకే ఒక మూటీ లేదు. నీయవ్వ. ఏమన్న ముంగట పడేదుందా తియ్యండ్రి. ఎవరో పైకే అంటున్నారు.

రంగులు అద్దె డైయింగ్‌లో పని చేసే మొగడు 'నైట్రోఫ్' వేసుకచచ్చిపోయిండు. పదుసు పిల్ల మూడేండ్ల పిలగాడు అంతవరకూ తల్లి ఒళ్ళె నిద్రపోయి లేచి ఏడ్చేసరికి రొమ్ము తీసి అందించింది. కొంగు చాటుకు 'గుట్ట గుట్ట' పాలు తాగుతున్న శబ్దం వినవస్తుంది. సక్కుబాయి అటుదిక్కు చూసింది. ఆ పిల్ల అమాయకపు ముఖాన్ని చూసి ఉసూరుమంది. కడుపుల చెయ్యిపెట్టి ఎవరో తిప్పినట్లైంది. పిల్ల బతుకు ఎప్పుడు పొద్దూకాలే, ఎప్పుడు తెల్లారాలె అనుకుంది.

కూరెల్ల కాడ అత్తగారింట్ల పూర్తిగా నడువకుంటయ్యింది. ఇద్దరు ఆడపిల్లల పెండ్లీలు అయిపోయినాయి. అత్తమామలు లోపల్లోపల దగ్గరికి గుంజుకు వస్తున్నరు. పోయిన కొడుకు కోసం ఏడుసుడో, కోడలూ పిల్లల కోసం ఏడుసుడో తెలువక ఠలాయిస్తున్నారు. కండెలు సుట్టుడులేక అత్తా కోడలు కలుపు కైకలికి పోతున్నారు. బిడ్డ కొడుకు 'మెట్టుబడి'ల చదువుతున్నాడు. కోడలు పిల్ల మీద ఊరి కన్ను పడుతుందని అత్తమామలు గ్రహించి ఇంటికి తాళం వేసి, మగ్గం సట్టర్‌ను, రాట్నంను దూలాలకు కట్టి, కోడలుకు బీడీల పని, తనకూ భార్యకు ఏదో పని కార్ఖాన్ల దొరక్కపోదని సిరిసిల్ల చేరాం.

ఇగ అప్పటి నుంచి సక్కుబాయికి ఊరిలో ఒక విధమైన బాధ అయితే, ఇక్కడ మరో రకమైన బాధ మొదలైంది. మామ పనిచేసే సేటు 'ఉంచుకుంటా, లేకపోతే రెండో లగ్గం చేసుకుంట'నని సోల్తి పెట్టాడు. తాను ససేమిరా అంది. మొదట్లో వ్యతిరేకించినా, అత్త మామలు కుక్కిన పేండ్ల లెక్క ఇక ఎప్పుఢు మారు మాటాడలేదు. పైగా, బుద్ధీ గ్యానం గల్ల బిడ్డనని కోడల్ని కన్న బిడ్డ కన్న ఎక్కువ ఉన్నన్ని రోజులు చూసుకున్నరు. అత్తమామలు కాలం చేసిన తరువాత ఒంటరి ఆడబతుకు ఎంత కష్టమో మరింత తెల్సింది. బీడిల కంపిని మునీం ఆయన కొన్ని రోజులు ఆకు సక్కంగ ఈయక కట్టలు తెంపేసుకుంట అరిగోస పుచ్చుకున్నాడు.

సక్కుబాయి పైస పైస కూడేసి పెద్ద బిడ్డ పెండ్లి చేసింది. ఈ నడుమ రాయిన్



Scanned by CamScanner

చెరువుల ఇంటి జాగా వచ్చింది. నాలుగు రేకుల పత్రాలతోని నీడ చేసుకుంది. అల్లుడు, బిడ్డ ఇక్కడే సుందరయ్య నగర్‌లో ఉంటారు. అల్లుడు సాంచాలు నడుపుతాడు. ఆయన అయ్యా, అవ్వ ముసలోల్లు. ఇంట్లనే ఉంటారు. బిడ్డకు కాల్జేత ముగ్గురు పిల్లలు అయ్యారు.

కొడుకు రవి రెక్కబొక్క పూర్తిగా ముదురలేదు. సేటు దగ్గర పద్దుల వసూలుకు గడలు పట్టుటానికి జీతమున్నాడు. ఎందుకోసమో నడిమిల లొల్లి జరిగి పని బందు పెట్టిండు. రవిని వట్టిగా ఉండద్దని తానూ తిట్టింది. మళ్ళీ రవి సైజింగ్‌ల తయారైన భీముల మీంచి రెండు మూడు వేయిల పాలిస్టర్ పోగుల్ని ఒక్కటొక్కటిని జాలిల నుంచి ఏనెలకు ఎక్కిచ్చే 'వైపని' పనికి పోతున్నాడు. చేతికింద పిలగానికి పోను రోజూ యాభై అరవై రూపాయలు తీసుకువస్తున్నాడు. కొడుకు గురించి 'ఇషార' తెలుసుకొని పిల్లను చూసి పెండ్లి చేసింది. బిడ్డా కొడుకు తొవ్వల పడ్డారు- అని సక్కుబాయి తన ఇన్ని రోజుల దుఃఖం తీరి, దేవునికి మూల్యం అయిందనుకుంది. అయినా బీడీలు చేసుడు బందు పెట్టలేదు. నడీడు మీదకు ఎప్పుడూ లేంది మళ్లీ పెండ్లి చేసుకోవాల్నని ఆలోచన అప్పుడప్పుడు వస్తుంది. ఛీ! అని కొట్టేసుకుంటుంది. అయినా కొంచెం కొంచెం మనసు అటు దిక్కు తనకు తెలియకుండానే గుంజుతుంది.

"చేనేత కార్మికులారా! చావు పరిష్కారం కాదు. పని లేకుంటే ఈ పని ఇడిసి పెట్టి మరో పనిలోకి వెళ్ళాలి. పాన్‌టేలలు, పండ్ల బండ్లు, సైకిల్ టాక్సులు- ఏదైనా సరే వేరే పని చేసుకోవాలే గాని చావకూడదు. నేను బ్యాంకర్లతో మాట్లాడి పెట్టుబడికి సహాయం ఇప్పిస్తాను." మరో నాయకుడు చావుల పరిష్కారానికి తెలివిగా సూచన చేశానని మురిసి పోతున్నాడు.

మళ్ళా కూర్చున్న మందిల నుండి గడబిడ మొదలైంది. మంత్రులు, శాసనసభ్యులు, కలెక్టర్లు- అంతా కుల వృత్తులు లేనివారు. అల్లకేంది. వేరే పని సూసుకోమని మా సెప్పుతరు గని, కన్నతల్లిని ఇడిసిపెట్టుడు, కన్న ఊరును తలువకపోవుడు ఎక్కడన్నా ఉంటదా! గట్లనే కుల వృత్తిని ఇడ్చిపెట్టుడంటే మామూలు విషయమా? మరొకడేమో టెక్నాలజీని మార్చు కోమంటడు. ఏం మార్చితే ఏం జరుగుతదో ఈల్లకు తెలుసా మరి. ఇంక తెలువదేమో అరవింద్, బాంబె డైయింగ్, మఫత్‌లాల్ పేరున్న కంపిండ్లే యాడాదిలకు ఆరునెల్లు పంటే



Scanned by CamScanner

ఆరు నెల్లు పని చేస్తున్నాయట. బట్ట ఎంత అవసరమో గంతే మిషన్ నడుపుతుండ్రట. మిగతా రోజులల్ల ఓ నిమిషం ఆయిల్ ఏసి చాల్ చేసి పెడుతుండ్రట, కుల వృత్తి మీది ప్రేమ పానం ఈల్లకేం తెలుసు? మనిషికో మాట మాట్లాడుకుంటున్నారు.

సక్కుబాయికి కొడుకు చావు మతిలకు వచ్చింది. రవి పెండ్లి చేసిన తరువాత బాగానే ఉన్నాడు కానీ, తాగుడుకు, గుటుకలకు అలవాటు పడ్డాడు. తిడితే ఎదురు చెప్పక, ఏమైందో చెప్పక రోజంతా ఇంటికి వచ్చుడూ బందు చేస్తున్నాడు. చెడిపోతున్నాడని కోడల్ని అడిగింది. కోడలు 'గయ్యిన' నా గండాన కన్నావు అని లేచింది. 'సంపాయించే కాడికి తాగుడు, బుక్కుడు తందనాలు ఆడితే నానోట్లె మన్నె. నా బొండిగ కోసినావ్' అని ఏడుపు అందుకుంది.

"ఎందుకే పైసలు? నేను పని చేస్తున్న గదా ఇత్తతియ్యి. ఏమి కావాల్నో చెప్పు కొనుక్కచ్చుకో" అంది.

ఇంకా రెచ్చిపోయి, "ఒక్క కొడుకని ఒహో మాగావురం చేసినవ్. బకీటెడు నీల్లు పెట్టుకునుడు చాతగాదు. దుప్పట్ల వదినె ఇంటికి నువ్వు పోతే రాత్రికి మాపు చేతుల ఉంది. జెర లేసి నల్ల నీల్లు పట్టమంటే ఓసోసి తిట్లు తిట్టి కొట్టిండు. అయినా ఒకనాడు తెలివికి సినిమాకు తీసుకపోయిండా- పొద్దు ఎక్కేదాక పండుడు, యాల్లకు అచ్చి తినుడు. మొద్దును పెంచినట్లు పెంచితివి. ఏం లాభం ఏం సంబరం." కోడలు.

"ఏందే ఏమో నిన్న, ఇయ్యాల్ల అచ్చినవో లేదో లావు లావు అనవట్టివి. ఇరువై మూడేండ్ల కొడుకును చేసి నీ చేతికిచ్చిన, వానికేం తక్కువ ఉంది. వాని అరికాలుకున్న సిరి నీ మొకానికి లేదు. నేను ఉన్నన్ని రోజులు గిట్లనే జరుగుతది. అయినా, మీ అయ్య అవ్వను తోలుకరావే! అల్లకు సాలు లేదా! కంట్ల పెట్టుకుంటవ్, కాల్చుక తింటవ్."

అత్తా కోడండ్ల మధ్య మాటామాటా పెరిగి కోడలు తల్లిగారింటికి పోయింది. పంచాయతీ అయ్యింది. కోడలు 'వేరు' ఉంటేనె వస్తానంది. కొడుకు ఇంకా ఎక్కువ తిరుగుతున్నాడు. అటు తల్లిని అనలేక, ఇటు పెండ్లాం నోరు మూయించలేక చప్పుడు చేస్తలేడు. సరేననుకొని ఏకాడికో ఓ కాడికి మనసు నింపుకొని సక్కుబాయి కొడుక్కు ఏరుపోసింది. రవి తల్లి మీద పడి ఏడిసిండు. ఇగ అప్పటి నుంచి కొడుకును తన ముందటనే తిడుతుంది. రవి బక్కపడుతున్నాడు. గుట్కాలు రోజు ఆరేడు బుక్కుతున్నాడు. కల్లు సీసాలకు



Scanned by CamScanner

అలవాటు పడ్డాడు. కోడలు ఏమన్న అంటే తల్లి ముఖంలకు చూసుకుంటు గోసగోసోలె పనికి పోతున్నాడు. సక్కుబాయి మొగుడు సచ్చినప్పటికన్నా, అత్తమామలు పోయినప్పటి కన్నా కొడుకు సంసారం గురించి, ఇంట్ల ఎవలు లేనిది చూసి ఎక్కువ కన్నీళ్ళు పెట్టుకుంది. అటు బిడ్డ సంసారం గట్లగట్లనే ఉంది. అల్లునికి పని సరిగ్గా దొరుకుతలేదు. ఇల్లారుగురికి పూటపూటకు ఎద్దెం మద్దెం అవుతుంది. బిడ్డ రాత్రి పగలు అనకుంట బీడీలు చేసిచేసి టి.బి. రోగం తెచ్చుకుంది. నోట్లెకెల్లి అప్పుడప్పుడు నెత్తురు పడుతుంది. పూర్తి కొంకీస లెక్క ముప్పై ఏండ్లకె ముసలి అవతారం వచ్చింది. ఒకసారి బిడ్డను చూడబోయి డాక్టరుకు సూపిచ్చి మందులు ఇప్పిచ్చి, గోళీలు ఒడిసి పోయినంక మళ్ళీ తెచ్చుకోమని రెండు వందలు చేతుల పెట్టి తెల్లారి వచ్చింది. ఏమైందోఏమో కోడలు రాత్రి కొడుకుతో కొట్లాడి పని చేయకుంటే ఇద్పుకాయితం ఇత్తనని తల్లిగారి గడ్డకు ఎక్కింది.

తల్లిని చూడగానే 'అవ్వా' అని పట్టన పగిలాడు. అసలు ఏందిరా అంటే రవి చెప్పడు. కోడలును అడిగితే తిట్లుసాపెన్లు.

"ఏడువకు కొడుకా! ఏడువకు నేను చచ్చినాంద్రా. బతికే ఉన్న. కొడుకా, పానం పాడుచేసుకోకు. నువ్వు ఆగం గాకు. నన్ను ఆగం చెయ్యకు. నేనున్న బిడ్డా. గిన్నేండ్ల నుంచి మీ అక్కను, నిన్ను సాదుకుంట వచ్చి గిప్పుడు సూసుకుంట ఉంటానా రవీ! అరేయ్ నిజం చెప్పురా! ఎందుకు లొల్లి అయితుంది. అసలు నువ్వు పనికి పోతున్నావా లేదురా." తక్కిచ్చి తక్కిచ్చి అడిగింది.

"అవ్వా! ఊళ్ళె సాంచలు సాన మట్టుకు బందుపడ్డయ్. పని ఒకనాడు దొరుకుతుంది. ఒకనాడు దొరుకుతలేదు. నాకా 'సైపని' తప్ప వేరే పని బాగా రాదాయె. పైసలు తేకుంటె కోడలి తోని పంచాయతీ అయితంది. ఏ పని చాతకానోనివి మిగతా అన్నింటికి తయార్. ఏట్లన్న పడి చావు. మీ అవ్వ రానీ... పోయింది మీ అక్క లం... చేసి పైసలన్ని కట్టిత్తుంది. నిన్ను, అక్కను తిట్టేసరికి కోపం వచ్చింది. నాలుగు సరిసిన." రవి చెప్పాడు.

ఎంతమందితోని చెప్పి పంపినా కోడలు నుంచి సప్పుడు లేదు. సరే కొడుకు కన్నా ఏముందని తెగాయించుకొని సంగతేందని ఇంటికి పోయింది. ఇయ్యపురాలు, ఇయ్యంపుడు, కోడలు కలిసి కొట్టినంత పని చేశారు. ఉత్త చేతులతోని ఇంటికి వచ్చింది.



Scanned by CamScanner

కొడుకు ఒకటీ లేదు, రెండు లేదు. 'అరీ' అనడు. 'శివ' అనడు. పని దొరికిన్నాడు పోతుండు. లేనినాడు వట్టిగ ఉంటాండు. ఎంత చెప్పినా గుట్కాలు మానకపోగా ఇంకా ఎక్కువ రాత్రి పూట తినడం మొదలు పెట్టాడు. ఏమన్న అంటే 'బతుక'నని ఈ మధ్య రెండు మూడుసార్లన్నాడు.

పగటి పూట బీడీలు చేసుకుంటూ సక్కుబాయి, రవి తినక పొద్దటి నుంచి ఎటో పోయిండని బజార్ల దిక్కు చూస్తుంది. సాటమీద పెట్టుకుని కత్తిరించిన బీడి ఆకు తడిగుడ్డల నుంచి తీసి, కుడి చేత్తో తంబాకు పోసి సిట్ట సిట్ట చేస్తూ, నడుమును కూసున్న కాన్నుంచే ముందుకూ వెనుకకూ కదుపుతూ దారం చుడుతుంది. ఎండ బాగా కొడుతుంది. వేపచెట్టు కింది హౌస్‌ల నీళ్ళతోని కాళ్ళు చేతులు కడుక్కొని ఇంట్లకు రవి వచ్చాడు.

"రవీ! పొద్దుగాలనంగ పోతివి. ఓ తిండి లేదు, ఠికానా లేదు. ఇది ఏందిరా! అరేయ్ సప్పుడు చేయక బీవండి పోరా" అంది.

"అవ్వా! అక్కడ గూడా పనిలేక ఇటే అత్తన్ను. భీవండి బస్సు రోజూ పుల్లుగ అత్తుంది. మొన్న పోయిన వారం పోయిన మా దోస్తు లేదు. గాడే కనుకయ్య  మళ్ళీ వట్టిగానే వచ్చిండు. అడిగితే 'కత' చెప్పాడు.

గప్పు గప్పు గుటుక, కల్లు వాసన వస్తుంది. మస్తు కోపం వచ్చింది. తిండికి రాగానే ఏమి తిట్టుడు తియ్యనుకుంది. "అవ్వా! అక్క దగ్గరికి పోయి సూసచ్చిన్నే- నిన్న పొద్దూకి నూకల పరం కొనుకొచ్చుకొని తిన్నారట. పొద్దుటి నుంచి తిండి వండుకోలేదు. బీడీలు చేస్తుంది. పిల్లగాండ్లు ఇంటిదగ్గరి తుమ్మలకింది బోరింగ్ కాడ ఆడుకుంటున్రు. గోలీలు ఏసుకుంటున్నావే అంటే గుడ్డల్ల నీళ్ళు గుడ్డల్ల కుక్కుకుని ఊం అంది. గట్ల కనిపియ్యలేదు. బావ బజారుకు పోయిండట. ముసలోల్లిద్దరు ముందట తుంగతోని వంచిన సాయిమాన్ల గుడ్డి కొంగలోలే కూకున్నరు. అక్కకు ఏమన్న ఇత్తమంటే నా దగ్గర జేబుల బుడ్డ పైసలేదు. దాని గిన్నెల అన్నం మెతుకు లేదు. నిలబడ బుద్ధిగాక ఇంటికచ్చిన్నే." రవి చెప్పాడు.

బిడ్డ దగ్గరికి ఇయ్యాల పొద్దూకేజాముల పోవాలనుకుంది. ఇంట్ల ఏమో దబ్బుల సప్పుడు అయితే, 'ఏందిరా సప్పుడు' అంటే 'ఏమీలేదే' అన్నాడు.

ఒక్కసారి ఇల్లంతా రప్పున గ్యాసునూనె వాసన వచ్చె. ఏమి పారబోసెనని చేతుల



Scanned by CamScanner

బీడి సుట్టి లేత్తమనే సరికి అగ్గిపుల్ల గీసుడు కనిపించింది. అరేయ్ ఏమి సేత్తున్నావురా అనేసరికే ముట్టిచ్చుకున్నడు. మంటలు లేసినాయి. 'అవ్వా! అవ్వా! అనుకుంటూ అడ్డం వచ్చిన తల్లిని తప్పించుకొని, మంటలతోని ముందటి వేపచెట్టు కింద 'ఒఱ్ఱుకుంట' పడ్డాడు. జోరబొంత చద్దర్ తెచ్చి గట్టిగా మాట్లాడకుంట కప్పింది. ఇంటి ముంగటోల్లు, ఇంటెనుకోల్లు గుంపుగూడి 'అరె ఇప్పుడు కనపడి మాట్లాడిచ్చే పిల్లగానికి గింతట్లనే ఏమైంది.' అంటున్నారు.

"రవీ! రవీ! ఎంతపని సేత్తివిరా!" తల్లి దగ్గరికి పోయి ఏడుస్తుంది. నెత్తి వెంట్రుకలు, బొమ్మమీద వెంట్రుకలు పెయ్యంతా కాలి బట్టలు రబ్బరు లెక్క అంటుకుపోయాయి. ముఖమంతా పొగచూరి కండ్లు మాత్రం కనబడుతున్నాయి. "అవ్వా! దూపైతంది. నీకు నాతోని ఏడుపుండదే అవ్వా! దారం పురి ఇచ్చుకపోయింది. గంతేనే. ఏడువకు అవ్వా. నీకాళ్ళు మొక్కుతా. వైపని, ఏనెకు ఎక్కిచ్చిన పోగులు ఇక సరిచేయరాకుంట తప్పినై" అంటూ నీళ్ళ కోసం సైగ చేశాడు. ఎవరో ఇంట్లకు పోయి ఇత్తడి బొంబాయి గుండు చెంబుల నీళ్ళు ముంచుకచ్చి ఇచ్చారు. దనాదన్ నిమిషంల తాగిండు.

సక్కుబాయి రెప్పపాటు సంఘటనకు వెంటనే ఏమి చెయ్యాలన్నా పాలుపోలేదు. "రవీ మొగుడు సచ్చి అత్తమామలు, అయ్య అవ్వలు సచ్చి, కొడుకా నువ్వే కోటి అనుకుంటే, గిట్ల నన్ను నడిగండ్లె బొండిగ పిసుకుతివి కదరా తండ్రీ" అంటూ గుండె బాదుకుంటుంది. ఇంటి ముందరి పెద్దమనిషి వచ్చి, అయ్యో దవాఖానకు తీసుకుపోదాం పాండ్రి. కొత్త బస్టాండ్ల ఆటో తీసుకురాపో అని ఎవలనో గెదుముతుండు.

పూర్తిగా కాలిన రవి 'గుటికీలు' మింగుతుండు.

"ఏం రాత రాసుకచ్చుకుంటివి బిడ్డా! పెండ్లి అయిన నుంచి రసరసలు, పని దొరుకని బాధ అన్ని కలిసి చావు మీదికి తెచ్చుకున్నావా కొడుకా. మీ అవ్వకు ఏమి చెప్పినవ్ బిడ్డా." ఇంటెనుక ముసలవ్వ రంజిలుతుంది. సక్కుబాయి సడిలేదు. సప్పుడు లేదు. మొద్దు అయి కట్టెసరుసుకు పోయింది.

మూలుగు బందయింది. తెర్సిన కండ్లు మూతలు పడ్డాయి. సూత్తే పిల్లగాడు పోయినట్టే ఉన్నాడు. ఎవరో అన్నారు. సక్కుబాయి నెత్తి కొట్టుకుంటుంది. ఎత్తుకోలు మొత్తుకోలు. ఆటో సప్పుడయ్యింది. కాని దాని అవసరం లేకుండా పోయింది.



Scanned by CamScanner

కొడుకు నట్టనడి ఎండల్ల చేండ్ల పొరుకోలె కాలిండు-వాడకట్టు పెద్దమనిషి అంటున్నాడు. కోడలు రాలేదు. దినవారాలు ఎల్లకముందే, పైగా కట్నం కిందిచ్చిన పైసలు ముంత తపాల కోసం వచ్చారు. ఇంట్లకు అడుగు పెట్టకముందే కోడలు తెచ్చిన సామాను బట్టలు బాతలు బజార్ల పారేసింది. అటు నుంచి అటే పట్టుకుపోయారు.

బిడ్డా, అల్లుని కష్టాలు రోజుకింత ఎక్కువ అవుతున్నాయి. ఉప్పిడి ఉపాసం ఏంచిన మక్క బోండలు తిని, కడుపు నిండా నీళ్ళు తాగి ఆకలి పోగొట్టుకుంటున్నారు. బిడ్డకు చేతుల ఉన్న పైసలు పెట్టి దవాఖాండ్ల మళ్ళీ సూయించి మందులు ఇప్పించింది. కొడుకు కత గట్ల ఒడుత్తే బిడ్డ గతి ఎట్లనో అని సక్కుబాయి బీడీలు హజార్ నుంచి పంద్రాసౌ దాక చేస్తుంది. అల్లుడు, బిడ్డా ఏమేమి గునాయించుకున్నరో గని కొడుకు సచ్చిన తరువాత ఆరు నెల్లకు 'సార'ల పురుగు మందు కలుపుకుని రాత్రి అందరూ తాగి తెల్లారి తలుపులు తీయక పోయే సరికి ఏందని చుట్టు పక్కలోల్లు చూసేసరికి ఎక్కడోల్లు అక్కడ పడి ప్రాణాలు విడిచారు.

చిన్న మనుమరాలు శాంతకు ఆఖర్న గ్లాసుల "దసరా పండుగ అత్తుంది కదా బిడ్డా! తాగు మంచిగుంటది. బువ్వ కావాల్నని ఏడుత్తవు గదా! ఒక్కపారి తాగితే ఇగ ఆకలి ఎప్పటికి వుండదు" అల్లుడు తాగిచ్చి, తాగియ్యక ముందే గ్లాసుతో పాటు కింద పడ్డాడు. మనుమరాలు 'షకుడ' పిల్ల పొద్దాకి జరిగిన విషయమంతా కళ్ళకు కట్టినట్టు చెప్తుతుంది. అందరూ విన్నారు.

మీటింగ్‌ల ఆఖరు ఆయన మాట్లాడుతున్నాడు.

సక్కుబాయి మనసు కలుక్కుమంది. నలుగురు అన్నదమ్ముల నడుమ ఒక ఆడిబిడ్డనని అవ్వా అయ్య నెయ్యో బుక్క పెరుగో ముద్దగా పెంచిండ్రి. అవ్వగారింట్ల ఏమి సుఖపడ్డదే సుఖం.... ఆ తరువాత బతుకంతా కష్టాలే.

సక్కుబాయికి తన కోసం కొట్లాడుకునే అవ్వా అయ్యా, పానపానంగా చూసిన పెనిమిటి, బిడ్డోలె అనుకున్న అత్తమామలు, గ్యాసునూనె పోసుకు కాలబెట్టుకు చచ్చిన కొడుకు, పురుగు మందు తాగి తెల్లారేసరికి 'జీవునం' విడిచిన బిడ్డా, అల్లుడు, ఇయ్యంపుడు ఇయ్యపురాలు, మనుమరాండ్రు యాద్కు వచ్చారు.



Scanned by CamScanner

ఎంత ఆపుకున్నా దుఃఖం లోపల నుంచి ఎత్తేసుకు వస్తుంది. మనుమరాలును ఇంకా దగ్గరికితీసుకుంది. ఒక్కసారి కొంగు ముఖం మీద కప్పుకు గుండె పగిలింది. "అవ్వ! ఈ రాత ఎవలకు రావద్దే అవ్వా! నీవేడ ఉన్నవే అవ్వా! నాకు యాల్ల పొద్దుగాల సావు రావాల్నే అవ్వా!... పేరు పేరున తలుసుకు తలుచుకు గొంతెత్తి ఏడుస్తుంది.

మీటింగ్‌ల మంది ఒక్కసారి ఇటు దిక్కు చూశారు. వేదిక మీది మంత్రులు 'ఏమైంది ఏమైంది' అంటూ తెలుసుకుని దగ్గరికి వచ్చారు. రెండు రోజుల కింద కుటుంబంలో ప్రాణంతో మిగిలిన శాంతతోని మంత్రి ఫోటోలు దిగాడు. సక్కుబాయి కన్నీళ్ళను తుడుస్తున్నాడు. శాంతను తాను దత్తత తీసుకొని పెండ్లి అయ్యేదాక పోషిస్తానని సెలవిచ్చాడు. ఎవరో ఊకుంచుతున్నారు. ఆమె కదిలి కదిలి కంటికేడు దారలు ఏడుస్తుంది. శాంత అమ్మమ్మను చూస్తుంది. సక్కుబాయి శాంతను గుండెలకు అద్దుకొని బిగ్గరగా దుఃఖిస్తుంది. ఎక్కడి నుంచో గాలిదుమారం వచ్చి, టెంట్‌నూ, దుమ్మునూ లేపుతుంది.

"– మానానికి జానెడు బట్ట కడుపుల పేగులు నోట్లెకు" రాంగా నేసే సాల్లోల్ల ఉసురు గోస వట్టిగా పోదు." వెనుక ఎవరో అంటున్నారు. చూసే కండ్లలో దుమ్ము వడ్డది. ఆకలి కడుపులో మన్ను వడ్డది. మంత్రులు మర్యాదస్థులు వస్తూనే ఉన్నారు. సభలు నీటి మీద రాతలు హామీలు చేతి కొసవేళ్ళు తడిసి కదిలిపోతూనే ఉన్నాయి. వగలు ఓదార్పు తతంగం జరుగుతూనే ఉంది. కార్మికుల ఆత్మహత్యల హోమం మాత్రం ఆగడం లేదు. మనసు తుకతుక ఉడికి కాలిపోతుంది. ●

(ఇండియాటుడే వార్షిక సంచిక 2002)

Scanned by CamScanner